

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - బుధవారం
సాయంత్రం - 6.34

సహర్ - గురువారం
ఉదయం - 4.53



అధికార కాంగ్రెస్‌లో అసంతృప్తి!

చేవెళ్ల ఆత్మీయ సమావేశంలో బట్టబయలు

కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ముసలం బయటపడింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహించడంపై అసంతృప్తిగా ఉన్నారు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి టికెట్లు బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే కేటాయించడంపై కాంగ్రెస్ సీనియర్లలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్‌లో చాపకింద నీరులా ఉన్న అసమ్మతి చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమావేశంలో బట్టబయలైంది. ప్రస్తుతం అధికార పార్టీలో చేరికలపై కాంగ్రెస్‌లో సీనియర్లు, కార్యకర్తల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు బహిరంగంగా సీనియర్ నేతలెవ్వరూ నోరు విప్పి మాట్లాడలేదు. కానీ లోలోపల కొందరు రగిలిపోతున్నారు. చేరికల సమయంలో కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహించడంపై అసంతృప్తిగా ఉన్న స్థానిక నేతలు బహిరంగంగా బయటపడలేదు. అయితే తాజాగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ నేతల ఆత్మీయ సమావేశంలో అసమ్మతి బట్టబయలైంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేకెత్తించాయి. పార్టీ అధినాయకత్వం డోర్లు తెరుస్తామంటూ పదే పదే ప్రకటిస్తోంది. కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేల సమక్షంలో కేఎల్లార్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేకెత్తించాయి. కేఎల్లార్ అలా మాట్లాడుతున్న సమయంలో అక్కడ ఉన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ చప్పట్లు కొట్టడం విశేషం.

అభ్యర్థిని గెలిపించుకుంటాం

ఇదిలా ఉంటే ఏదీ ఏమైనా పార్టీ టికెట్ ఇచ్చిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత మాత్రం తీసుకుంటామని కేఎల్లార్ చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను మంచి మిత్రులమని మామధ్య విభేదాలు లేవని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలకు సమాయాత్తమవుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అత్యంత కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు నువ్వా-నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. ఈ రెండు స్థానాల్లో పోటీని ఈ మూడు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

రెండు టికెట్లూ బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే..

అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ సీటును బీఆర్ఎస్ నుంచి వచ్చిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి కేటాయించారు. అలాగే మల్కాజిగిరి స్థానాన్ని బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ప్రకటించారు. ఈ రెండు సీట్లు బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే కేటాయించడంపై కాంగ్రెస్ సీనియర్లలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయాలనుకున్న నేతలకు ఇప్పుడు కాంగ్రెస్ పిలిచి టికెట్లు ఇవ్వడంపై కొందరు నేతలు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సీనియర్ నేతలు తమపై కేసులు పెట్టిన వారికి ఇప్పుడు ఎలా పనిచేయాలని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని గుర్తించకుండా అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండే వారిని పిలిచి టికెట్లు ఇవ్వడమేమిటనీ అడుగుతున్నారు. అయితే ఇప్పటి వరకు బహిరంగంగా నెతలెవ్వరూ దీనిపై మాట్లాడలేదు.

- సీఎం ఎదుటే చేరికలపై ప్రశ్నించిన కేఎల్లార్
- మోసగాళ్లను చేర్చుకుంటే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన
- కలకలం రేకెత్తించిన కేఎల్లార్ వ్యాఖ్యలు

సమావేశాలను పట్టించుకోని అసంతృప్త నేతలు

అసంతృప్తిగా ఉన్న నేతలు స్థానికంగా జరిగే సమావేశాలను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. నిన్నమొన్నటి వరకు బద్ధవిరోధులుగా ఉండి తమపై కేసులు పెట్టించిన వారి కోసం ఇప్పుడు పనిచేయాలా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే అదను చూసి అందరి సమక్షంలోనే కేఎల్లాఆర్ ఈఅంశాన్ని లేవనెత్తడం చర్చనీయాంశంగా మారింది. తరువాత మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకారమే టికెట్లు కేటాయింపు ఉంటుందని పనిచేసే కార్యకర్తలు, నేతలకు న్యాయం జరుగుతుందని హామీ ఇస్తూ ఇటీవల ఉమ్మడి జిల్లా నేతలకు నామినేటెడ్ పోస్టుల కేటాయింపును గుర్తు చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

షెడ్యూల్ ప్రకారమే ధాన్యం సేకరణ

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మార్చి26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): షెడ్యూల్ ప్రకారమే యాసంగి ధాన్య సేకరణ చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చివరిగింజ వరకూ కొనుగోలు చేయనున్నట్లు సేకరించనున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మేరీరేఖ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ గౌతంపోట్రు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలో 2425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 13,226 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పాల్వన్‌కుమార్

టీబీ నివారణలో అద్వితీయం

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి పాల్వన్ కుమార్

వికారాబాద్, మార్చి 26 : టీబీ నిర్ధారణ, చికిత్స, నియంత్రణలో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందని డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ టీబీ నివారణ దినాన్ని పురస్కరించుకుని రామయ్యగూడ పీహెచ్‌సీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇదే స్ఫూర్తిని కొనసాగించి వచ్చేఏడాదికి టీబీ నివారణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో వికారాబాద్ జిల్లా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. టీబీ నిర్మూలనకు విశేషంగా కృషి చేసిన వైద్యాధికారులు గిరిధర్, ప్రవీణ్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ పవిత్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాడైన బోరును పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో తదితరులు

పర్వత్‌పల్లిలో తాగునీటి బోరుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, మార్చి 26: పర్వత్‌పల్లిలో తాగునీటి కష్టాలు అంటూ 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో, ఎంపీవో రమేష్‌తో కలిసి గ్రామానికి చేరుకుని మరమ్మతుకు గురైన డైరెక్టు పంపింగ్ సిస్టం బోరును స్వయంగా పరిశీలించారు. అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలతో భగీరథ నీరు సరఫరాపై ఆరా తీశారు. బోరు, ట్యాంక్ ఏర్పాటు కోసం సొంతస్థలం కేటాయించిన గుంటి మల్లారెడ్డితో బోరు మరమ్మతు విషయమై ఎంపీడీవో చర్చించారు.పంచాయతీలో ప్రస్తుతం నిధులు లేవని బోరు ఫ్లషింగ్ చేయిస్తే నిధులు వచ్చాక బిల్లు చెల్లిస్తామని ఎంపీడీవో సూచించడంతో మల్లారెడ్డి అంగీకరించారు. రెండు రోజుల్లోగా పాడైన బోరును వినియోగంలోకి తీసుకువచ్చేలా ఎంపీడీవో చర్యలు చేపట్టడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అంతకు ముందు బోరు మరమ్మతు విషయమై గ్రామ ప్రత్యేకాధికారి హరిరాం కూడా కార్యదర్శితో మాట్లాడినట్లు తెలిసింది.

కస్టోడియన్ భూములను కాపాడండి

మేడ్చల్, మార్చి26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ జిల్లా కాప్రా మండలంలోని కస్టోడియన్ భూములను కబ్జాదారులచెర నుంచి కాపాడాలని మండల దేవేందర్‌గౌడ్ కోరారు. మంగళవారం కాప్రా కస్టోడియన్ భూముల కబ్జా విషయమై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాప్రాలోని సర్వే నంబరు 9, 11, 47, 140 నుంచి 143, 151, నుంచి, 676, 677లలో మెత్తం 90.08 ఎకరాల భూమి కస్టోడియన్ ల్యాండ్‌గా ప్రభుత్వ రికార్డులలో నమోదైందన్నారు. కాందిశీకులకు చెందిన ఈ భూమి ప్రస్తుతం కాప్రా తహసీల్దార్ పర్యవేక్షణలో ఉందని తెలిపారు. 2011లో సుప్రీం కోర్టు పలువురు కాందిశీకుల వారసులకు మెత్తం భూములను కేటాయించిందన్నారు. అట్టి భూములను కాందిశీకుల వారసుల్లో కొందరు విక్రయించగా నివాస కాలనీలు ఏర్పాడ్డాయని దేవేందర్‌గౌడ్ చెప్పారు. మిగతా 69.21 ఎకరాల కస్టోడియన్ భూములు ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయన్నారు. మండల కుటుంబీకులకు ఈ భూములపై ఎలాంటి హక్కులు లేనప్పటికీ ఈ విషయాన్ని దాచి శరత్‌చంద్రారెడ్డి అనే వ్యక్తి మా నుంచి జీపీఏ చేయించుకున్నారన్నారు. జీపీఏ చేసిన మండల కుటుంబంలో తాను సభ్యుడినని ఆయన తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి, నాగరాజుతో పాటు అతని అనుచరులు, పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో కస్టోడియన్ భూముల్లో ఇళ్ల యజమానులను వేధింపులకు గురి చేస్తూ భూముల కబ్జాకు యత్నిసున్నాడని వాపోయారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూన్నారని ఆరోపించారు. తనకు రక్షణ కల్పించి కస్టోడియన్ భూముల కబ్జాకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవేందర్‌గౌడ్ అధికారులను కోరారు.

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు విధుల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల సిబ్బంది కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించినట్లు తెలిపారు. తదుపరి మాస్టర్ ట్రైనర్స్ పీవోలకు శిక్షణాతరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈడీఎం మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. స్వీప్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో 5 కే రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఆలంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు, 565 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ. ఎక్కడైతే మంచినీటి సమస్య ఉందో అక్కడ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. అదే విధంగా, ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 122కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎస్‌వో రాజేశ్వర్, డీఎం సుగుణబాయి, అడిషనల్ డీఆర్‌డీఏ సరోజ, మిషన్ భగరథ శ్రీనివాస్, చెల్లారెడ్డి, డీపీవో జయసుధ పాల్గొన్నారు.

రైతులు సంఘటితంగా ఉండాలి

ఘట్‌కేసర్, మార్చి 26: రైతులంతా రాజకీయాలకతీతంగా సంఘటితమై తమ సమస్యలను తామే పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారతీయ సంఘటన మంత్రి దీనేష్ కులకర్ణి అన్నారు. ఘట్‌కేసర్‌లోని బంధన్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన జరిగిన కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను రైతులే గ్రామ స్థాయి నుంచి గుర్తించి పరిష్కరించుకోవడానికి ఐక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమంకోసం పాటుపడాలన్నారు. కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధద్యక్షుడు పన్నాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీని నెరవేర్చాలన్నారు. రుణమాఫీ నిధులను ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేయకపోవడంతో రైతులను బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తేరుకొని రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. ఈసంవత్సరం తక్కువ వర్షపాతం నమోదు కావడం వలన రైతులు సాగుచేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రంగారావు, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్, లావణ్య, రాజిరెడ్డి, మాణిక్యరెడ్డి, గజేందర్, రవి, వీభద్రరావు, భూమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోనమెత్తిన తమిళులు

● ముగిసిన కురు మారియమ్మ ఉత్సవాలు

కీసర, మార్చి26: కీసర మండల కేంద్రంలో రెండు రోజులుగా జరిగిన తమిళులు ఆరాధ్యదైవమైన శ్రీ కురు మారియమ్మ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. కీసరలో గకొన్నేళ్లుగా తమిళులు నివాసం ఉంటూ మారియమ్మ ఆలయాని నిర్మించుకున్నారు. ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం అమ్మవారికి అత్యంత భక్తి, శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావణ్ కూమార్ గుప్తా అన్నదానం ఏర్పాటు చేయగా, ఆలయ నిర్వహకులు శ్రావణ్ కూమార్ గుప్తా దంపతులను శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెలిదె రమేష్ గుప్తా దంపతులు, తదితరులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

తలోదారి!

- గుండ్లపోచంపల్లిలో కారు ఖాళీ!
- బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పనున్న ఐదుగురు మున్సిపల్ కౌన్సిలర్లు?
- కొందరు కాంగ్రెస్, మరికొందరు బీజేపీలోకి వెళ్లేందుకు ఆసక్తి
- మున్ముందు మిగతా వారు జంపింగ్ జపాంగ్!
- వలసల నియంత్రణలో ఎమ్మెల్యే మల్లారెడ్డి విఫలం?



మేడ్చల్‌టౌన్, మార్చి 26: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మానస పుత్రికగా పేరుగాంచిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజులుగా వెళ్దామా..వద్దా.. అంటు తర్జనభర్జన పడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు చివరికి పార్టీ వీడాల్సిందే అన్న నిర్ణయానికి వచ్చారు. ప్రధానంగా 13వార్డుకు చెందిన దొడ్లమల్లికార్జున్ ముదిరాజ్, సుతారిగుడకు చెందిన రజితవెంకటేశ్, అరికల్‌గూడకు చెందిన శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి, బాసిరగడికి చెందిన రాజకుమారిసుధాకర్, గ్నానాపూర్‌కు చెందిన ఆంథోనమ్మఫిలిప్స్‌లు బీఆర్ఎస్‌ను వీడనున్నారు. పార్టీని వీడుతున్న ఐదుగురు కౌన్సిలర్ల ఒకే పార్టీలో చేరుతారా.. లేదా అన్న విషయంలో ఏకాభిప్రాయం లేనప్పటికీ పార్టీని వీడటం మాత్రం వీడడం ఖాయమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దొడ్లమల్లికార్జున్ ముదిరాజ్, శ్రీలతశ్రీనివాస్‌రెడ్డిలు బీజేపీవైపు మొగ్గు చూపుతుండగా, ఆంథోనమ్మ, రాజకుమారి, రజితవెంకటేశ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 15 కౌన్సిలర్లు ఉండగా, అందులో ఇద్దరు బీజేపీ, ఒకరు కాంగ్రెస్ కౌన్సిలర్ కాగా , మిగితా 12 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. కాగా ప్రస్తుతం నలుగురు మినహా మిగితా వారందరు తమకు తోచిన దారిని ఎంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ పరిధిలోని కండ్లకోయకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

మల్లారెడ్డికి చెప్పే వెళ్తున్న కౌన్సిలర్లు

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న కౌన్సిలర్లు తమ నిర్ణయాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెప్పే వెళ్తున్నట్లు ప్రచారం కొనసాగుతున్నది. అయితే వారిని ఎమ్మెల్యే ఆపడం లేదని, ఎవరి ఇష్టం.. వారిదంటూ మల్లారెడ్డి చెప్పడంతో చాలా మంది కౌన్సిలర్లు తమ రాజకీయ భవిష్యతు కోసం బీఆర్ఎస్‌ను గుడ్‌బై చెపుతున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కాగా బీఆర్ఎస్‌ను వదిలివెళ్తున్న నేతలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి బీజేపీ వైపు మొగ్గు చూపే విధంగా పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్లు కొందరు కౌన్సిలర్లు బాహాటంగానే చెబుతున్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి కళాశాలలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉండడం, కాంగ్రెస్- బీఆర్ఎస్‌ల మధ్య కొనసాగుతున్న రాజకీయ కక్షలకు తాము బలి కాకూడదని ముందస్తుగా కౌన్సిలర్లు బీఆర్ఎస్ వీడేందుకు మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తుంది.

మరో నలుగురు కాంగ్రెస్‌లోకి..

మున్సిపాలిటీలో మొత్తం 12 బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా, అందులో ప్రస్తుతం పార్టీని వీడనున్న ఐదుగురు కౌన్సిర్లలో ముగ్గురు కాంగ్రెస్‌లో, ఇద్దరు బీజేపీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. అంతేకాకుండా మరో నలుగురు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ హామీ ఇస్తే బీఆర్ఎస్ రాజీనామ చేసి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. కాగా స్థానికంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నేతలు తమ ఉనికి కాపాడకోవటానికి ఇతరులను పార్టీలో రానివ్వకుండా అడ్డుతగులుతున్నారని, దీంతో సమయం కోసం ఎదురు చూస్తున్నామని కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరాలని ఉన్నా తమ వద్దకు ఎవ్వరూ రావడం లేదని...బీజేపీ వారు ప్రతీ రోజు తమకు టచ్‌లో ఉంటూ పార్టీలో చేరాలని ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. మున్ముందదు 12 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయిగౌడ్

ధారూరు, మార్చి 26: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా స్టేషన్ ధారూరుకు చెందిన సాయిగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌రెడ్డి మంగళవారం ప్రకటించిన బీజేవైఎం జిల్లా నూతన కమిటీలో మండలం నుంచి ఇద్దరికి చోటుకల్పించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అంతారం గ్రామానికి చెందిన నవభారత్ రెడ్డిని నియమించారు. మండలంలో బీజేపీ పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని సాయిగౌడ్, నవభారత్ రెడ్డిలు ఈ సందర్భంగా తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

● పంచాయతీ కార్మికుల ఆందోళన



తాండూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

తాండూరు రూరల్, మార్చి 26: మండలంలోని చంద్రవంచ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. చంద్రవంచ గ్రామపంచాయతీలోని కార్మికుల వేతనాలు రూ.8500లు ఇస్తామని, కొందరివి దొంగసంతకాలు చేసుకుని, రూ.3వేలు, రూ.5వేలు ఇస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ గ్రామపంచాయతీలో మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు బాల్‌రాజ్, శివకుమార్‌లు కార్మికుల వద్ద నుంచి వేతన రూపంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. మరో ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, జీవో నెంబర్-51ని సవరించి, ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భీమయ్య, వెంకట్, మాణిక్యమ్మ, వెంకటేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అవినీతి జరగలేదు

చంద్రవంచ గ్రామపంచాయతీలో ప్రస్తుతం పంచాయతీ తీర్మానం మేరకే వేతనాలు పంపిణీ చేస్తున్నాం. నిబంధనల ప్రకారం రూ.19,500లు ఇవ్వాల్సి ఉండగా రూ.26వేల 500లు ఇస్తున్నాం. మాపై ఎలాంటి విచారణకైనా సిద్ధం. పంచాయతీలో ఎలాంటి అవినీతి జరగలేదు.

\- రతన్‌సింగ్, మండల పంచాయతీ అధికారి



హంస వాహనసేవలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హంస వాహనసేవ

తలకొండపల్లి, మార్చి 26 : మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు మంగళవారం అర్చకులు రామాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పారాయణం, హంస వాహనసేవ, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లురవి

దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం

» నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

కడ్తాల్, మార్చి 26 : దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజా వ్యతిరేకతను గ్రహించిన బీజేపీ అధికారాన్ని కాపాడుకోవడానికి నీచ రాజకీయాలకు ఒడిగట్టి ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని మండిపడ్డారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణలతో కలసి మల్లు రవి పర్యటించారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారై తొలిసారిగా కడ్తాలకు వచ్చిన రవికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం కేశవులు, రవీందర్‌నాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి, కాలె మల్లయ్య, వెంకటేష్‌లు ఘనస్వాగతం పలికారు. ఈమేరకు ఆయన్ను సన్మానించారు. అనంతరం మల్లు రవి మాట్లాడుతూ దేశంలో ప్రజావ్యతిరేకతను గ్రహించిన మోదీ సర్కార్ కుట్ర రాజకీయాలకు తెరతీసిందన్నారు. దేశంలో 350కిపైగా స్థానాలను దక్కించుకొని రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఒర గబెట్టిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణ, తులసీరాం, బాలరాజు, మానయ్య, నరేష్‌నాయక్ తదితరులున్నారు.

శివశివా!

వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేనా!



వికారాబాద్ శివసాగర్ చెరువు

» శివసాగర్ చెరువును శుద్ధితో పాటు.. యంత్రాల మరమ్మతులు చేపట్టేనా!

» వికారాబాద్ ప్రజల తాగునీటి కష్టాలు తీరేనా!

వికారాబాద్, మార్చి 26: ఎండలు ముదురుతున్నాయి... భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.. జిల్లాలో తాగునీటి సమస్యలు తతెత్తుతున్నాయి. వికారాబాద్ జిల్లా ప్రాంతానికి శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను తీసుకొచ్చి శుద్ధి చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జలాశయాలు అడుగుగంటుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేదు. ఈ క్రమంలోనే పాలకులు, అధికారులు మంచినీటి విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎప్పుడు మిషన్ భగీరథ నీటికీ బ్రేక్ పడిన వెంటనే ప్రజలకు ప్రత్యామ్నాయంగా నీరు అందించే మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. వికారాబాద్ మున్సిపల్ పరిధి విషయానికొస్తే సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ నీటికి బ్రేక్ పడితే మంచినీటి అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. వికారాబాద్ పట్టణానికి ప్రత్యామ్నాయంగా శివసాగర్ చెరువు ఉన్నప్పటికీ దాన్ని ఉపయోగించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. శివసాగర్ చెరువు నుంచి నీటిని సరఫరా చేసే క్రమంలో ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని శుద్ధి చేసే యంత్రాలను సరి చేయాల్సి ఉన్నా ఐదేళ్లుగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గతంలో మరమ్మతులకు నిధులు కేటాయించినప్పటికీ వాటిని మధ్యవర్తులే మింగేయడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. వికారాబాద్ మున్సిపాలిటీలో పాలకులు, అధికారులు మధ్య సమన్వయం లోపించడంతో రాజకీయ నాయకుల మధ్య విభేదాలు తప్పా, ఇక్కడి ప్రజలు సమస్యలను పట్టించుకోవడం లేదు. మున్ముందు వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కానున్నాయి. వెంటనే శివసాగర్ చెరువులో శుద్ధితో పాటు ఫిల్టర్ బెడ్ వద్ద యంత్రాలకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టి ప్రజాపాలన సాగించాలని కోరుతున్నారు.



పనిచేయని నీటిశుద్ధి యంత్రాలు



శివసాగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎప్పుడూ లొల్లినే...

ఇదిలా ఉంటే వికారాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజులరమేష్ పదవి చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్నా ఏడాదిపాటే యథేచ్ఛగా పాలన అందించారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో వైరం పెరిగి పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వంలోను మున్సిపాలిటీకి పెద్దగా నిధులు మంజూరుకాకపోవడంతో పాటు, ఎన్నికల కోడ్‌తో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. అనంతరం మునిసిపల్ ఛైర్‌పర్సన్ పార్టీ మారినప్పటికీ కాంగ్రెస్‌లో కొద్ది రోజుల్లోనే గ్రూపు రాజకీయాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మునిసిపల్ ఛైర్ పర్సన్ మంజులరమేష్ మధ్య లోలోపల జరుగుతున్న కోల్డ్‌వార్ జరుగుతోందని జోరుగా ప్రచారం జరుగుతుంది. మునిసిపల్ వ్యవహరాల్లో, పార్టీ వ్యవహరాల్లో తమదే పెత్తనం సాగాలంటే తమదే సాగాలనే ధోరణిలో ఇరువురు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా గొడవలు, గ్రూపు రాజకీయలు పక్కన పెట్టి ప్రజా అవసరాలకు సంబంధించిన విషయాలపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

» పరిహారం చెల్లించాలంటూ కుటుంబసభ్యుల రాస్తారోకో

» గంటపాటు ట్రాఫిక్‌జామ్ ఇబ్బందులుపడ్డ ప్రయాణికులు

కొందుర్గు, మార్చి 26 : మండల కేంద్రం శివారులోని క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గుండ్లకాడి నర్సింలుకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు సాయి(26) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. మంగళవారం నలుగురు స్నేహితులతో కలిసి మండల కేంద్రం శివారులో, గంగన్నగూడెం రోడ్డు పక్కన ఉన్న క్వారీ గుంతలో ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో సాయి నీళ్లలో మునిగి ఎంతకూ బయటకు రాలేదు. విషయం తెలుసుకున్న స్నేహితులు అరుపులు, కేకలు వేయడంతో అక్కడే క్రషర్ పనులు చేసే కొందరు వచ్చి గుంతలోకి దిగి చూశారు. అప్పటికే సాయి చనిపోయాడు. అనంతరం శవాన్ని బయటకు తీశారు. క్రషర్ యాజమాని గుంత ఎక్కువ లోతు తీయడంతోనే సాయి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. శవంతో మండల కేంద్రం చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేశారు. సాయి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రషర్ యాజమని వచ్చేంత వరకు శవాన్ని ఇక్కడి నుంచి తీసేదిలేదని భీష్మించారు. దాంతో షాద్‌నగర్, పరిగి వైపుతో పాటు నవాబ్‌పేట్ వైపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దాదాపు గంట పాటు బస్సుల్లోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు పోలీసులు మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పి ధర్నాను విరమింపజేశారు. సాయి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సాయి (ఫైల్)



శవంతో రాస్తారోకో చేస్తున్న సాయి బంధువులు



క్రషర్ క్వారీ గుంత

మంచి ఆలోచనా విధానంతోనే ఆరోగ్యం

» కోఠి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ వినితా పాండే

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 26: మంచి ఆలోచన విధానంతోనే ఆరోగ్యం, ఆనందం, ఆనందం లభిస్తుందని కోఠి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ వినితాపాండే అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఇంటర్నేషనల్ హ్యాపీనెస్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతోషంగా ఉండాలంటే ఆలోచన సరళి మార్చుక్వోలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం వెళ్లకుండా జీవిత విజయాల వైపు ముందుకు సాగాలన్నారు. సామాజిక కార్యక్రమాలు చేయడం వల్ల మానవత్వంతో పాటు సంతోషాన్ని కలిగిస్తాయన్నారు. ఆనందంగా ఉన్నవారు చదువుల్లో, ఉద్యోగాల్లో రాణిస్తారని గుర్తుచేశారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానసిక నిపుణులు మహీపతి శ్రీనివాస్‌రావు, ఫార్మసీ డీన్ వసుధభక్తి, అధ్యాపకులు కృష్ణప్రసాద్, సునంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ వినితాపాండేను సన్మానిస్తున్న అధ్యాపకులు

3లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ, మార్చి 26: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని 3లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దోమ మండలంలోని ప్రతీ గ్రామంలో ఐదు సార్లు తిరిగానని అన్నారు. ప్రస్తుత ఎంపీ కనీసం ఒక్కసారైనా వచ్చాడా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లు బీఆర్‌ఎస్‌పై కోపంతో వేశారే తప్ప ప్రేమతో కాదన్నారు. ప్రస్తుతం బీజేపీకి మంచి అనుకూల వాతావరణం ఉందన్నారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేస్తూ తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారుతి కిరణ్, మండల అధ్యక్షుడు అనంతయ్య, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, అసెంబ్లీ ప్రభారి పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, అయినాపూరం యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వివేక్‌రెడ్డి, యువ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, మండల కార్యదర్శి నర్సింహ, కేపీ రాజు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారు

పూడూరు: ప్రజలకు టీఆర్‌ఎస్ పార్టీపై ఉన్న కోపంతో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించారని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మన్నెగూడలో మంగళవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వేసిన ఓట్లు ప్రేమతో కాదని, బీఆర్‌ఎస్ పార్టీపై ఉన్న కోపంతోనే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూలమైన వాతావరణం ఉందని, కార్యకర్తలంతా కలిసి చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేయడం ఖాయన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, మండల అధ్యక్షుడు రాఘవేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు మల్లేష్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేక్‌రెడ్డి, యువ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటయ్య, మహిళా మోర్చా నాయకురాలు మాధవి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి

కులకచర్ల: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కులకచర్లలోని విజయ్‌చంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన కులకచర్ల, చౌడాపూర్ మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేసి చేవేళ్ల పార్లమెంట్ గడ్డపై కాషాయం జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్ బూనెటి, చేవేళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పార్టీ నాయకులు అంజనేయులు, వెంకటయ్య, మైపాల్, బందెయ్య, సురేశ్, జానకిరామ్, సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో వేదికమీదున్న ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న రైతులు

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

» జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 26: ఘట్‌కేసర్ సహకార సంఘం అభివృద్ధికి పాలక వర్గం, రైతులు సమష్టిగా కృషి చేయాలని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో మంగళవారం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన సహకార సఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. చిన్నచిన్న విషయాలకే రైతులు ఆందోళనకు దిగడం సరికాదన్నారు. రెండు సంవత్సరాలుగా సమావేశాల్లో ఇదే తరహాలో గలాటా జరగడం పరిపాటిగా మారిందన్నారు. సంఘం కార్యాలయంలో ఎండీ సమస్యలపై స్పందించకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఘట్‌కేసర్ సహకార సంఘం రాష్ట్రంలోనే నెంబర్ వన్ సొసైటీగా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘానికి గోదాంల నిర్మాణ పనులకు ప్రభుత్వం నుంచి స్థలాన్ని ఇప్పించడానికి ప్రయత్నిస్తున్నామని, సరైన స్థలం లేక ఆలస్యమవుతోందని వివరించారు.

అధిక వడ్డీ వసూళ్లపై రైతుల ఆగ్రహం

సహకార సంఘంలో అధిక వడ్డీ వసూళ్లపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ బ్యాంకుల కంటే అధికంగా వడ్డీలు వసూలు చేయడమేంటని మండిపడ్డారు. దీంతో అధికారులు, చైర్మన్ స్పందిస్తూ సహకార సంఘంలో రైతులకు ఎప్పుడంటే అప్పుడు రుణ సదుపాయం లభిస్తుందని చెప్పారు. రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘం పనిచేస్తోందన్నారు. ఇంతలో కొందరు రైతులు లేచి డైరెక్టర్ల ప్రయాణ ఖర్చుల కింద రూ.2.10లక్షలు ఎలా ఖర్చు చేస్తారని పాలకవర్గాన్ని నిలదీశారు. చైర్మన్, ఎండీ సమాధానాలకు సంతృప్తి చెందని రైతులు మూకుమ్మడిగా వేదికవైపు దూసుకువచ్చారు. సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. రైతులంతా ఒక్కసారిగా ప్రశ్నల వర్షం కురిపించారు. సంఘంలో సభ్యత్వమున్న రైతులు మృతిచెందితే రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పినప్పటికీ అనేక కుంటిసాకులు చెబుతూ ఆర్థిక సాయం అందించడంలేదని రైతులు ఆరోపించారు. ఇంతలో జడ్పీ చైర్మన్, సహకార సంఘం చైర్మన్లు కలగజేసుకుని రైతులను శాంతింపజేశారు. సంఘంలో ఎలాంటి అక్రమాలు జరిగినట్లు నిరూపించినా రాజీనామా చేసి వెళ్లిపోతానని చైర్మన్ రాంరెడ్డి అన్నారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ సహకార సంఘం లాభాలబాటలో ఉన్నప్పటికీ రైతులకు ప్రమాదబీమాను కల్పించడంలో పాలకవర్గం విఫలమైందని ఆరోపించారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిపట్ల రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై చైర్మన్ రాంరెడ్డి, ఎంపీపీ మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోఠి రిజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారిణి సునీతారాణి, వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రవి, మేనేజర్ కరుణాకర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

షాబాద్, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని సీఎం నివాసంలో మండలానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పినట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నగరంలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీఎం, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభారత్‌ల ఆధ్వర్యంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తరలివెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని ముందుకు సాగాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు నాయకులు చెప్పారు. చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఐదు మండలాలోని పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి

ఎన్నికల అధికారులకు రూట్లవారీగా విధులు

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 26: జిల్లాలో జరిగే సాధారణ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లకు రూట్ వారిగా విధులు కేటాయించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో పోలింగ్ విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కేటాయించిన రూట్లను వివరించారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల వారీగా రూట్ మ్యాపులు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు, రూట్ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యం



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్, మార్చి 26: పేదలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యమని కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు అన్నారు. వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, ఫౌండర్ అండ్ సీఈవో మోహన్ సుద్దబట్ల, సీఓఓ సామ్ పిలిప్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిజిత్ హరి కుమార్‌లు మాట్లాడుతూ.. ఆసుపత్రి వ్యవస్థాపకులు గురు ఎన్‌రెడ్డి సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న మోకిలా, 22న సంగారెడ్డి జిల్లా సింగూరు మండలం జగ్గారెడ్డి పేట, 23న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం జిన్నారం, 26న తేదిన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు ఎంబ్రేస్ అండ్ కాంటినెంటర్ ఆసుపత్రి భాగస్వామ్యంతో ఉచిత వైద్య సామగ్రిని పంపిణీ చేశారు. అవసమున్న వారికి ఉచితంగా వీల్‌చైర్లు, వాకర్లు, బీపీ, గ్లూకో మీటర్, బెడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి, జయతీర్థచారి, మురారి వశిష్ఠ, శ్రీనివాస్‌గౌడ్, వైద్యులు పాల్గొన్నారు.

'అవాస్తవాలు నమ్మొద్దు'

తాండూరు: మార్చి 26: వికారాబాద్ జిల్లా పోలీస్ సిబ్బంది అవాస్తవాలు నమ్మొద్దని జిల్లా పోలీస్ శాఖ అధ్యక్షుడు టి. అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులకు సరెండర్స్ టీఏ, డీఏ, ఏరియర్స్ మెడికల్ బిల్లులకు సంబంధించి ఇతర జిల్లాల్లోనూ బిల్లులు రాలేదన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది ఈ విషయంపై సమన్వయం పాటించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి రావాల్సిన బిల్లుల విషయమై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీతోనూ మాట్లాడామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అవాస్తవాలను నమ్మరాదన్నారు. ఇతర జిల్లాలకు అన్ని రకాల బిల్స్ రావడమనేది అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు.

కొడంగల్ బార్ అసోసియేషన్ నూతన కమిటీ



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్, మార్చి 26: కొడంగల్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో మంగళవారం బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా భాగ్యలత, జాయింట్ సెక్రటరీగా కృష్ణంరాజు, ట్రెజరర్‌గా రమేష్ లైబ్రెరియన్‌గా కృష్ణ, గేమ్స్, కల్చరల్ సెక్రటరీగా రాములు ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఏడాది పాటు కొనసాగుతుందని తెలిపారు.

శ్రీ మల్లికార్జునస్వామి గొల్ల కురుమ సంఘం కమిటీ ఎన్నిక



కురుమ సంఘం కమిటీ సభ్యులు

వెూమిన్‌పేట్, మార్చి 26: మండలంలోని టేకులపల్లిలో మంగళవారం శ్రీ మల్లికార్జున స్వామి గొల్ల కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 36 మంది గొల్ల కురుమ సంఘం సభ్యులు ఎన్నికల అధికారి అజ్మత్‌పాష ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా గొల్ల శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా కొమరయ్య, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోషాధికారిగా గోవర్ధన్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మయ్య, పావయ్య, బువ్వయ్య, రుక్కమ్మ, సంగమణిలను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికైన కమిటీ పదవీ కాలం 5 సంవత్సరాల పాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, కారోబార్ నర్సింహులు, కమిటీ సభ్యులు బీరయ్య, కృష్ణ, బాల్‌రాజు, మహేందర్, అంజమ్మ, మల్లేశం, లక్ష్మీ, కృష్ణ, బువ్వయ్య, అంజయ్య, పర్శురాం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తాండూరు, మార్చి 26: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏఎస్‌జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాత తాండూరులోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో 200 కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కలీం పాల్గొని ప్రసంగిస్తూ నిరుపేద కుటుంబంలో వెలుగు నింపేందుకు ఎల్లప్పుడూ ప్రజాసేవలో పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందులతో క్షయవ్యాధి నివారణ



క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో వైద్య సిబ్బంది

కులకచర్ల, మార్చి 26: మందులతో క్షయవ్యాధిని నివారించవచ్చని కులకచర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి మాధురి తెలిపారు. ఆసుపత్రిలో క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి మైక్రో బ్యాక్టీరియా టుబెర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారు దగ్గినప్పుడు తుంపరలు పైన పడటంతో వ్యాధి ఇతరులకు సోకుతుందన్నారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గిపోతుందని, ప్రతీనెల క్షయవ్యాధిగ్రస్తులకు రూ.500చొప్పున ఆరునెలల పాటు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది స్వరూపరాణి, యాదమ్మ, విజయలక్ష్మి, రత్నమ్మ, వెంకటమ్మ, జ్యోతి, జంగమ్మ, శ్రీలత, సుజాత, మంగమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

చెంగిచర్లలో మరోసారి ఉద్రిక్తత



చెంగిచర్లలో బైఠాయించిన బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు

ఉప్పల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకల్లో ఒక వర్గంపై దాడి చేసిన ఘటనలో గాయాలైన మహిళలను పరామర్శించేందుకు మంగళవారం బీజేపీ మహిళా మోర్చా నాయకులు మంగళవారం వచ్చారు. ఈక్రమంలో పోలీసులకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డికి పోలీసులకు వాగ్వాదం జరిగింది. దీంతో మహిళలు పోలీసుల వైఖరి నిరసిస్తూ ఘటనా స్థలంలో బైఠాయించి ఆందోళన చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. మేకల శిల్పారెడ్డితోపాటు మరికొంత మహిళలను అరెస్ట్ చేసి కీసర పీఎస్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మహిళపైనే కాకుండా పోలీసులపై దాడులకు దిగడం సిగ్గుచేటన్నారు. నిందితులపై అట్రాసిటీ కేసులు నమోదుచేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, కల్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు మాధవీలత సంఘీభావం



నిరసన కారులకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలత

కీసర రూరల్: చెంగిచెర్ల వివాదానికి నిరసనగా మంగళవారం బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శోభారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దీంతో చెంగిచెర్ల పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి, కీసర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాదవీలత కీసర పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, అమరం మోహన్‌రెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరులో ఉచితంగా ఎంసెట్ కోచింగ్



కోచింగ్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు: మార్చి 26: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీఎస్ ఈఏపీసెట్ ఎంసెట్ ఫ్రీ కోచింగ్‌ను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రైవేట్‌లో కోచింగ్ తీసుకుంటే లక్షల్లో వ్యయం అవుతుందని, ఉచిత కోచింగ్ సెంటర్‌లు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ కోచింగ్‌కు ఎంపీ రంజిత్‌రెడ్డి రూ.2లక్షలు సాయం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సైతం సాయమందిస్తానని చెప్పారని అన్నారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమలతర్ మాట్లాడుతూ ఫ్రీకోచింగ్ సెంటర్ 35రోజులు షార్ట్ ఫామ్‌గా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ తులసీ దాస్, రామకృష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖయ్యాం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో తాండూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్

తాండూరు రూరల్, మార్చి 26: తాండూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ సీఎం రోహిత్‌రెడ్డితో ఈ ప్రాంతం విషయాలపై వివరించినట్లు తెలిపారు. సీఎం స్పందిస్తూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని అభినందించారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

తాండూరురూరల్, మార్చి 26: తాండూరులో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షకు మొత్తం 2,822 మందికి గాను, 2,768 మంది విద్యార్థులు హాజరు కాగా, 54మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు. మండలంలోని మల్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రంలో 188 మంది, పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో 193 మందికి గాను 192 మంది పరీక్షలు రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు.

పెండింగ్‌లో ఉన్న కూలి చెల్లించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 26: ఉపాధిహామీలో పని చేసిన కూలీలకు గత ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలి చెల్లించాలని కూలీలు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం వారు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో ఉపాధి హామీలో పలు రకాల పనులు చేసినా డబ్బులు నేటికీ అందించడం లేదని వాపోయారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న కూలి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

హెల్త్ విజిటర్‌కు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న రాజునాయక్

కులకచర్ల, మార్చి 26: కులకచర్ల ఆసుపత్రిలో క్షయవ్యాధి హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజునాయక్‌కు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వికారాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ చేతుల మీదుగా రాజునాయక్ ఉత్తమ క్షయవ్యాధి నివారణ హెల్త్ విజిటర్‌గా అవార్డు పొందారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ఆయనను అభినందించారు.

6, 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి, 26: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6నుంచి 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల విద్యాసంస్థ ప్రాంతీయ అధికారి ఎన్.రజిని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థుల తల్లిదండ్రులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 26: ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులను ఉదయం, సాయంత్రం వేళల్లో చేపట్టాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ గురించి ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అదేవిధంగా జీవకోటికి ప్రాణధారమైన నీటి పొదుపు గురించి ఇంకుడు గుంతల ప్రాధాన్యతను వివరించారు. ఎండవేడిమికి తలపై టోపి లేదా వస్త్రం ధరించాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** నవాంద్గీ సొసైటీ సర్వసభ్య సమావేశం రేపు(గురువారం) నిర్వహించనున్నట్లు ఆ సంఘం సీఈవో బందెయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి అధ్యక్షతన కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి డైరెక్టర్లు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

● **పూడూరు:** మండలంలోని మేడిపల్లికలాన్ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం ఈనెల 28వ తేదీన నిర్వహిస్తునట్లు హెచ్‌ఎం ఎండి.ఖాజామైనుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28వ తేదీన జరిగే ఈ వార్షికోత్సవానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, మాజీ ఎమ్మెల్యే కొప్పులు మహేష్ రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఎంఈవో హరిశ్చంద్ర, స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ స్వరూపా ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

● **కులకచర్ల:** కులకచర్ల మండల కేంద్రంలో బుధవారం రాత్రి నుంచి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై వీధినాటకం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు శ్రీరామాంజనేయ భజన మండలి భక్తులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27, 29, 31, ఏప్రిల్ 2, 4 తేదీల్లో ప్రదర్శన కొనసాగుతుందన్నారు. పాత్రలు, పాత్రధారులు కులకచర్ల గ్రామస్థులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● **కులకచర్ల:** మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ రాందాస్‌నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్‌గౌడ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

● **పెద్దేముల్:** సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీలో సంఘం సభ్యులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి తెలిపారు. పెద్దేముల్ తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహాజన సభ సమావేశం నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మేడ్చల్ టౌన్, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ నుంచి బైక్‌పై మేడ్చల్ వైపు వస్తున్న ఓంప్రకాష్(23) ఆయోధ్య చౌరస్తా వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. దీంతో ఓంప్రకాశ్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిగిలో 207 గ్రాముల గంజాయి పట్టివేత

● స్నేహితుడిని గంజాయి కేసులో ఇరికించేందుకు యత్నం

● నలుగురి నిందితులకు రిమాండ్



గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పరిగి, మార్చి 26: పాత కక్షలతో స్నేహితుడినే గంజాయి కేసులో ఇరికిద్దామని కుట్ర పన్ని చివరికి వారే కటకటాలైన ఉదంతమిది. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సయ్యద్‌పల్లికి చెందిన ముషారఫ్, పరిగికి చెందిన సయ్యద్ ఉజేఫ్ స్నేహితులు. ముషారఫ్ పరిగిలో మెడికల్‌షాపు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ముషారఫ్‌ను ఏవిధంగానైనా ఇబ్బందిపెట్టాలని సయ్యద్‌ఉజేఫ్ కుట్రపన్నాడు. ఇందులో భాగంగా సయ్యద్‌ఉజేఫ్, పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్‌కు చెందిన వి.సాయిరాంచారి, సోండేపూర్‌కు చెందిన వి.సతీష్‌లు కలిసి, పరిగి మండలం పెద్దమాదారం గ్రామానికి చెందిన కోట్లీ ప్రశాంత్ దగ్గర 207 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశారు. ముషారఫ్ కారులో ఆగంజాయిని పెట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగప్రవేశం చేసి కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ముషారఫ్ ప్రమేయం లేదని పోలీసులు గుర్తించారు. గంజాయిని కారులోపెట్టి కేసులో ఇరికిచేందుకు కుట్ర చేసిన సయ్యద్‌ఉజేఫ్, అందుకు సహకరించిన వి.సాయిరాంచారి, పి.సతీష్, కోట్లీ ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అయితే ఈ ఉదంతంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధం లేని వ్యక్తులను అరెస్టు చేశారని కొంతమంది అంటున్నారు. ఈ ఘటన ఐదు రోజుల కిందట జరిగితే పోలీసులు సోమవారం జరిగినట్లు తెలిపారు. ఈ కేసు విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెల్లడంతో కేసును పోలీసులు మమ అనిపించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, మార్చి, 26: ఘట్‌కేసర్‌లో వేర్వేరు చోట్ల అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై ఘట్‌కేసర్ పోలీసులు దాడులు నిర్వహించారు. మద్యంతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్ఐ రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మైసమ్మగుట్ట కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి అక్కడ 36మద్యం బాటిళ్లను, ఈడబ్ల్యూఎస్ కాలనీలో పంజాల బాల్‌లక్ష్మీ ఇంట్లో 45బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాల్‌లక్ష్మీ, నర్రి మైసమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

రిసార్ట్ నిర్వాహకులపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ ఏర్పాటు చేసిన ఓ రీసార్ట్‌పై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌లోని విలేజ్ ట్రయల్స్ రీసార్ట్ నిర్వాహకులు హోలీ పండుగ సందర్భంగా డీజే ఏర్పాటు చేసుకునేందుకు పోలీసుల అనుమతి కోరారు. అయితే పోలీసులు నిరాకరించారు. అయినప్పటికీ రీసార్ట్ నిర్వాహకులు డీజేతో పాటు లౌడ్ స్పీకర్స్, బ్యాండ్‌లతో ఈవెంట్ నిర్వహించారు. ఈ మేరకు ఈవెంట్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ తీగలు చోరీ



వ్యవసాయ పొలంలో మూడు తీగలు లేని విద్యుత్ స్తంభాలు

ధారూరు, మార్చి 26: విద్యుత్ స్తంభాలు ఎక్కి త్రీఫేజ్ విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈఘటన ధారూరు శివారులో చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన ప్రకారం.. ధారూరు రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 452లో బోయిని సత్యమ్మ, అనిత, శశికళ పొలంలోని నాలుగు విద్యుత్ స్తంభాలకు ఉన్న మూడు లైన్ల విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి అపహరించారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేసి విద్యుత్‌స్తంభాలు ఎక్కి మూడు లైన్లకు ఉన్న తీగలను చోరీ చేశారు. ఇది గుర్తించిన రైతు బోయిని అంజయ్య పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశాడు.

కుంటలో పడి వృద్ధురాలి మృతి

కులకచర్ల, మార్చి 26: కులకచర్ల మండల కేంద్రం సమీపంలో గల లింగసాని కుంటలో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రంలో కృష్ణయ్య, వెంకటమ్మ(60)దంపతులు నివాసముంటున్నారు. వెంకటమ్మ పేడ తీసుకొచ్చేందుకని ఇంటి నుంచి సోమవారం సాయంత్రం వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతకసాగారు. ఈ క్రమంలో మంగళవారం వెంకటమ్మ మృతదేహం లింగసాని కుంటలో తేలడంతో గ్రామస్తులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. వెంకటమ్మ కుంటలో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి జారిపడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉండగా వారు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు.

కలప లారీ పట్టివేత

కొడంగల్, మార్చి 26: అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా మీదుగా మంగళవారం అక్రమ కలప లోడ్‌తో వెళ్తున్న లారీని పోలీసులు తనిఖీ చేయగా పట్టుబడినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన లారీని ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళకు గాయాలు

ధారూరు, మార్చి 26: గుర్తుతెలియని ఓ మహిళ రోడ్డు పక్క గాయాలతో పడి ఉంది. కొన ఊపిరితో ఉన్న ఆమెను పోలీసులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ధారూరు సమీపంలోని ఒంటి మామిడిచెట్టు వద్ద చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ధారూరు నుంచి వికారాబాద్ వెళ్లే రోడ్డుమార్గంలో ఒంటి మామిడిచెట్టు సమీపంలో గుర్తు తెలియని మహిళ(40) తలకు తీవ్రగాయాలపాలై రోడ్డుపక్కన పడి ఉంది. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాస్థలానికి చేరుకున్న సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌లు కొన ఊపిరితో ఉన్న మహిళను 108 అంబులెన్సులో వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కాగా మహిళ ఎడమ చేతిపై శ్రీనివాస్ అనే పేరు పచ్చబొట్టు ఉందని తెలిపారు. మహిళది రోడ్డు ప్రమాదమా లేదా ఎవరైనా హత్యాయత్నం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.